# మేరీ వరుడి ఎన్నిక

జయసింహ ఆఫీసునుంచి వస్తూనే తనకు వచ్చిన ఉత్తరాలు చూసుకున్నాడు. వాటిలో రెండు ఉత్తరాలను మళ్ళీ ఒకసారి చదువుకుని జేబులో పెట్టుకున్నాడు. అతడి వెనుక నౌకరు ఫైల్సుతెచ్చి బల్లమీద పెట్టాడు.

కారు శబ్దం వినపడగానే వల్లి వంటయింట్లోకి వెళ్ళి కాఫీ టిఫిన్లు డైనింగ్ టేబుల్ మీదికి చేర్చటానికి వెళ్ళింది. ఆమె అన్నీ అమర్చేసరికి అతడు బట్టలు మార్చుకుని వచ్చాడు.

కాఫీకప్పు చేత బట్టుకుని "ఏమిటి విశేషాలు ?" అడిగాడు.

"ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలలోపల విశేషాలేముంటాయి ?" అంది నవ్వుతూ.

"కాలేజికి వెళ్ళలేదా ?"

"వెళ్ళాను, ఒక రౌండు తిరిగాను. ఆఫీసుపని చూసుకుని మూడుగంటలకే వచ్చాను. కాలక్షేపానికి పేపర్లున్నాయిగా! వాటినన్నిటినీ చదువుతూ కూర్చున్నాను."

"ప్రభుత్వం వారు ఎయిడ్ ఇస్తామన్నారా ?"

"ఇంకా అనలేదు. ఈ సంవత్సరం ఇచ్చేటట్టు లేరు. వచ్చేఏడాదికి రావచ్చు. ఎయిడ్ వస్తే లెక్చెరర్లకు జీతాలు పెరుగుతాయి. అంతవరకూ వాళ్ళకు ఇస్తామన్న జీతాలు ఇస్తునే ఉన్నాంగా ? వాళ్ళందరూ సంతృప్తిగానే ఉన్నారు. ఎయిడ్ కోసం చేసే ప్రయత్నాలు వాళ్లూ చూస్తునే ఉన్నారు. పని బాధ్యతతో రూల్సుప్రకారం చేస్తున్నారు. పిల్లలుకూడా బాగా చదువుకుంటున్నారు. మంచిగ్రేడ్‌లో పాసవుతున్నారు. ఇన్స్‌పెక్షన్‌కి వచ్చిన ఆఫీసర్లుకూడా టీచర్ల సమర్థతను మెచ్చుకు

న్నారు. మాకు వచ్చేఏడాదికి ఎయిడ్ వస్తుందని ప్రోత్సాహకరంగా చెబుతున్నారు. మేనేజ్‌మెంటు కూడా బాగుందన్నారు" అంది సంతృప్తితో.

"కష్టేఫలీ అన్నారు పెద్దలు. ఏ పని అయినా కష్టపడిచేస్తే ఫలిస్తుంది. అదిసరే. ఇవాళ నీ ప్రోగ్రాం ఏమిటి?'' అడిగాడు.

"నాకు ప్రత్యేకంగా ఏంలేదు. కాకపోతే ఒక స్నేహితురాలిని చూడాలనుకున్నాను. కొంచెం అనారోగ్యంగా ఉందని కబురుచేసింది. ఇవాళ కాకపోతే రేపు వెళ్తాను. ఎందుకడుగుతున్నారు?"

"ఇవాళ మధ్యాహ్నం మా డిపార్టుమెంటుకు సంబంధించిన ఆఫీసరు వచ్చి గెస్టుహౌస్‌లో దిగాడు. ఆయనను కలుసుకోవటానికి నేను వెళ్తున్నాను. ఆయన భార్యతో వచ్చాడు కనుక నిన్నుకూడా తీసుకువస్తానని ఫోనుచేశాను."

"పేరు?"

"ఆయన పేరు అలెగ్జాండరు. ఆయన ప్రభుత్వం పక్షాన ఆరునెలలు విదేశాలలోని కంపెనీలు ఎట్లా పనిచేస్తున్నాయోనని చూడటానికి వెళ్ళాడు. ఆమెను అక్కడే వివాహం చేసుకుని ఈ దేశానికి తీసుకువచ్చాడు. ఆమె పేరు మేరీ అలెగ్జాండర్."

"అలాగా! నేనూ వచ్చి చూస్తాను. కెనడాలో నేను ఎంత్రోపాలజీలో ప్రాజెక్టువర్కు చేస్తూ ఉండగా మేరీ అనే ఆమె నేనూ ఒకరూమ్‌లో ఉండేవాళ్ళం. ఒకవేళ ఆమేనేమోననుకుని అడిగాను."

"వెళ్తున్నాం కదా. అవిడేనేమో చూడు.''

ఇద్దరూ గెస్టుహవుస్‌కి వెళ్ళారు. అప్పటికే వాళ్ళిద్దరూ లాన్‌లో కుర్చీలు వేసుకుని కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. జయసింహ, వల్లి వెళ్ళగానే లేచి "రండి రండి, మీరు ఎప్పుడొస్తారా" అని చూస్తున్నాము" అన్నాడు అలెగ్జాండర్. జయసింహ తన భార్యను వాళ్ళిద్దరికీ పరిచయం చేశాడు.

అలెగ్జాండర్ కూడా మేరీని పరిచయం చేశాడు.

పరస్పరం నమస్కారాలు చేసుకున్న తరువాత జయసింహా అలెగ్జాండర్ ఆఫీసు విషయాలు మాట్లాడుకోవటం మొదలుపెట్టారు.

అంతలో నౌకరు కూల్‌డ్రింక్సు తీసుకువచ్చాడు.

వల్లి ఇంట్లోనుంచి బయలుదేరేటప్పుడు తనకు తెలిసిన మేరీయేమోనని ఆశించింది. తనకు ప్రాజెక్టువర్కు చేయటానికి స్కాలర్‌షిప్పు కూడా వచ్చింది. కనుక పెళ్ళి కాకముందే వెళ్ళింది కెనడా. మేరీ ఏదో పనిచేస్తూ చదువుకుంటున్నా నని చెప్పింది. ఆమె బల్లమీద కొన్ని పుస్తకాలూ నోట్సు ఉండేవి. ఉదయం ఎనిమిది గంటలకు రూమ్‌నుంచి బయలుదేరేది. మళ్ళీ భోజనం వేళకు వచ్చేది. వల్లీ తన పనిమీద తనూ బైటికివెళ్ళేది. రాత్రిళ్ళు భోజనాలు కాగానే గదిలో పక్కల మీదికి చేరుకునేవారు. తిరిగి తిరిగి వచ్చారు కనుక ఒక గంటసేపు మాట్లాడకుండా విశ్రాంతిగా పడుకునేవారు. తరువాత మేరీ వల్లిని పడుకోనిచ్చేది కాదు. కబుర్లు మొదలుపెట్టేది.

"నీ ప్రాజెక్టువర్కు అవగానే తిరిగి ఇండియాకు వెళ్ళిపోతావా?" అడిగేది మేరీ.

"అవును. ప్రాజెక్టువర్కుకు టైమ్ ఉంటుంది. అంతలోపల వర్కు చేసె య్యాలి. పని కాగానే వెళ్ళిపోతాను. నా వర్కుకూడా అయిపోవచ్చింది."

"అయితే త్వరలోనే వెళ్తావన్నమాట"

"అలా అని అనుకుంటున్నాను."

"వెళ్ళి పెళ్ళిచేసుకుంటావా?"

"ఏమో, ఏంచేస్తానో? ఇప్పుడేం చెప్పలేను. ఉద్యోగం దొరికితే చేయాలని ఉంది. నాకు తగినది దొరకాలి. ఉద్యోగమే చేస్తానో, పెళ్ళిచేసుకుంటానో ఇప్పుడే ఏమీ చెప్పలేను."

"నీవు పెళ్ళి చేసుకోవనుకుంటాను. ఎందుకంటే ప్రాజెక్టువర్కంటూ తిరుగు తావు ఎప్పుడుచూసినా. గదిలోకి వచ్చి రాసుకుంటూ కూర్చుంటావు. మరి పెళ్ళి ప్రయత్నాలు ఏమీ చేస్తున్నట్టు లేదు."

"పెళ్ళి ప్రయత్నానికి కాదుగా ఇంతదూరం వచ్చింది?"

"అదీ ఒకపక్క చేస్తూ ఉండాలి. వర్కు ఒకపక్క చేస్తూ ఉండాలి. పెళ్ళంటూ చేసుకోవాలనుకున్నప్పుడు నచ్చినవాడు దొరకద్దూ?"

''ఏమో ? ఇప్పుడే చెప్పలేనన్నానుగా ? నాసంగతి వదలిపెట్టి నీ సంగతి చెప్పు, వింటాను. నాకు తెలియనివి తెలుసుకుంటాను."

''నా సంగతా ?" విరగబడి నవ్వింది మేరీ. "వల్లీ, మనం వట్టిమనిషితో కాదుగా కాపరంచేసేది ? వాళ్ళ మనసులతో, వాళ్ళ స్వభావాలతో, వాళ్ళ జీవిత విధానంతో, నాకు నచ్చినవాడు దొరికితే వెంటనే పెళ్ళిచేసుకుంటాను" అని పడు కున్నదల్లా లేచి కూర్చునేది.

''వాళ్ళ అలవాట్లూ పద్ధతులూ జీవిత విధానాలూ ఎట్లా తెలుస్తాయి ? ఒకటి కాదు, అన్ని విషయాలూ నచ్చాలికదా ?"

ఆ మాట వినగానే "నీవు ఈ సంగతిని గురించి ఆలోచించలేదంటే ఏమిటో అనుకున్నాను. ఇప్పుడు నిజమని తెలిసింది. ఎట్లా తెలుస్తాయంటావేమిటి ? కొన్నాళ్ళు చూడాలి. పరిశీలించాలి. అదే దృష్టితో గమనిస్తూ ఉండాలి కనబడిన వాళ్ళను."

వల్లీకి నవ్వొచ్చింది.

"అలా నవ్వకు, జీవితంలో సుఖపడాలంటే అన్నీ గమనించాలి. నీవను కున్న విషయాలలో ఏది నచ్చకపోయినా వాడిని వదలిపెట్టి ఇంకొకడిని చూడాలి" అనేది.

"కొన్నాళ్ళు ఎట్లా చూడాలి ?

''పిచ్చిదానా ! నీకు ఓనమాలు కూడా నేర్పాల్సి వచ్చేటట్టుంది. కొన్నాళ్ళు స్నేహంచేస్తే అన్నీ తెలుస్తాయి. అవి మనకు సరిపడతాయో లేదో చూసుకుని సరిపడే టట్టు ఉంటేనే కొనసాగించాలి. లేకపోతే ఇంకొకడన్నానుగా ?"

''నీకు నచ్చిన అంశాలను చెప్పావు. ఎన్నాళ్ళు పరిశీలించినా ఎంతమందిని చూసినా కోరుకున్న అంశాలు అన్నీ ఒక్కడిలో ఉండకపోతే ఏంచెయ్యాలని నా ప్రశ్న.''

"అన్నీ ఉన్నవాడు దొరికేవరకూ వెతకాలి"

"మేరీ ! నీవు నాకేమీ తెలియదన్నావు. ఆ మాట అక్షరలా నిజమే. ఇది షాపుకాదు, ఇదికాదని అదీ, అదికాదని ఇంకొటీ వెతకటానికి. అందులో మనిషిని

బాగా పరిశీలించి వెతకాలంటున్నావు. పరిశీలించి వెతకటానికి స్నేహం చేయాలంటున్నావు. స్నేహంచేసి స్టడీ చెయ్యాలంటున్నావు. ఇదేమయినా పుస్తకమా స్టడీ చేయటానికి? మనం పరిశీలన చెయ్యబోయేది మనిషిని. మనుష్యుల స్వభావం అందరిదీ పైకి కనబడుతుందని నమ్ముతావా? స్వభావం ఏక్షణంలో ఎట్లా రియాక్టవుతుందో కనుక్కోటానికి కొంతకాలం పట్టవచ్చు. వాళ్ళను పరిశీలించాలనీ స్టడీ చేయాలనీ చూస్తే తేలేవిషయమా అది ? ఇది నాసందేహం సుమా ! నవ్వకు మరి.''

"మరి-నచ్చకపోతే ఎలా చేసుకుంటావుచెప్పు? లభించేంతవరకూ ఆగాలి."

"అయితే ఈ నిర్ణయం జరిగేసరికి కొంతకాలం పట్టవచ్చు. నేననుకుంటాను. మరీ పెద్దగుణాలులేకుండా ఉన్నట్లయితే, చిన్న చిన్నవి మనకు నచ్చని గుణాలు ఉంటేఏం? మనం మెల్లగా తెలియచెప్పటమూ, కొన్ని మనం సర్దుకుంటూ పోతేనూ క్రమేణా వాళ్లేతెలుసుకుంటారేమో? వాళ్లూసర్దుబాటు నేర్చుకుంటారేమో? ఆ విషయం ఆలోచించకూడదంటావా?"

వల్లి పద్ధతి ఎందులోనూ మేరీతో కలవదు. అందుకని విరగబడి నవ్వింది.

"స్వభావాలు మనం అనుకున్నట్లుగా ఉండాల్సిందే సద్దుబాట్లూ ఒదిగి ఉండటాలూ కుదరవు. మరి-నీవు కొంచెము కష్టపడితే దొరుకుతారు. లోకం గొడ్డుపోలేదు. ఈ మాట ఇదివరకే చెప్పాను.

"అదికాదు మేరీ, మొదట నీకనుకూలంగా, నీవు కోరిన గుణాలన్నీ ఉన్నట్టేనటించి, నీమెప్పుపొందిన తరువాత, క్రమంగా పై పై మెరుపులు పోయి అసలు గుణాలు బైటపడితే? అప్పుడు మనమేంచెయ్యాలన్నది మొదటిప్రశ్న. రెండవది-నీకునచ్చిన మనిషితోకూడా కొన్ని విషయాలు నచ్చనివి ఉంటాయేమో అంతర్గతంగా. ఇట్లా ఇద్దరికీకలిసి నచ్చటమన్నది అరుదేమో? అందులోనూ కొన్నాళ్ళ కతడిలో మార్పు ఏకారణంచేతనయినావస్తే - అతడు నీకు మొదట నచ్చినవాడే అయినా-నీతో కలిసిఉన్నవాడే అయినప్పటికీ అప్పుడేం చెయ్యాలన్నది రెండవప్రశ్న. చెప్పు?"

"పిచ్చిదానా! అదా నీ సందేహం? ఇది ప్రపంచం. అతడొక్కడేనా? ఈ విశాల ప్రపంచంలో?"

ఈ ధోరణిలో ఉండేవి సంభాషణలు. తన మాటలు వినకపోతే ఊరుకునేది కాదు మేరీ. నిద్రపోనిచ్చేదికాదు. నిద్రపోకపోతే తన ప్రాజెక్టు పర్కు చేయలేక పోతానేమోనని భయపడేది వల్లి.

ఇదంతా జ్ఞాపకంవచ్చింది వల్లికి ఆమెను చూడగానే.

"మేరీ, నన్ను గుర్తుపట్టావా? మనం కెనడాలో ఒక రూంలో కొంతకాలం ఉన్నాం. జ్ఞాపకం వచ్చిందా?" అడిగింది వల్లి.

"ఎవరో విజిటర్లువస్తారంటే ఇంకెవరో ననుకున్నాను. నిన్ను గుర్తుపట్టకేం? చూసినవెంటనే పట్టాను. ఆయన నీ భర్తా?" మేరీ అడిగింది.

"అవును"

"పెళ్ళెప్పుడు చేసుకున్నావు?"

"'అక్కడినుంచి వచ్చినతరువాత రెండేళ్లు పనిచేశాను. తరువాత పెళ్ళి చేసుకున్నాను" మేరీ మళ్ళీవెనకటిధోరణి మొదలుపెడుతుందేమోనని భయంవేసింది వల్లికి. "మేరీ మనంలోపలికివెళ్ళి మాట్లాడుకుందాము. వాళ్ళను డిస్టర్బుచెయ్యకుండా" ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

"జీవితం బాగుందా? పిల్లలా?" అడిగింది మేరీ.

"ఇద్దరు పిల్లలు. మేము నిలకడగా ఒక చోట ఉండమేమోనని మా అమ్మ దగ్గర ఉంచాను. చదువుకుంటున్నారు"

పెళ్ళిచేసుకోవటమూ - పిల్లలుపుట్టటమూ-వాళ్ళు చదువుల కెదగటంవరకూ వచ్చిందన్నమాట! అయితే నీకిజీవితం నచ్చిందన్నమాటేనా?

"అన్నమాటే"

"అయితే నీవు ఆయనను మెచ్చే చేసుకున్నావా?"

"ఆయనే మెచ్చి నన్ను చేసుకున్నారు."

"మరి నీకు నచ్చటం?"

"ఆయనమెప్పే నన్నుకూడా ఆయనను మెచ్చేటట్టుచేసింది. పెళ్ళి

చేసుకున్నాం. ఇప్పటికీ ప్రధానమైన అంశాలు ఇద్దరిలోనూ మారలేదు. చిన్న చిన్న విషయాలను సర్దుకోవటం నేర్చుకున్నాము నా సంగతి అడిగావు. నీ సంగతి చెప్పు?"

"నేనా? రెండేళ్ళ కిందట ఇండియాకు వచ్చాను. అలెగ్జాండర్‌ను ఏడాది క్రిందట పెళ్ళిచేసుకున్నాను."

"అయితే అప్పటి నీ అభిప్రాయాలు అట్లాగేఉన్నాయా? అన్నివిధాలా నీకు నచ్చినవ్యక్తిని పెళ్ళి చేసుకున్నావన్నమాట. ఎట్లాగయినా అన్నమాటను చేసి చూపించేచానవు."

"కొన్నాళ్ళు చూశాను. కొంతకాలం ఆలోచించాను. 'ఫరవాలేదులే' అనుకుని పెళ్ళిచేసుకున్నాను.

"నీ అభిరుచులతో ఆయనవికలిశాయా? లేక కలిసేటట్టుచేశావా? ఆయనకు ఒక్కటైనా స్వంత అభిప్రాయమంటూ ఉండనిచ్చావా? ఏమిటో ఆ రహస్యం? నీవు మెచ్చావంటే ప్రపంచ వింతలలో ఇదొకటన్నమాట. అంతేనా?"

నవ్వింది మేరీ.

వల్లి 'తన యిల్లంతా చూపిస్తాను ఒకసారి రమ్మనమ'ని కోరింది. ఊళ్లో ఉంటే వస్తానంది మేరీ.

ఆ మరునాడు వస్తారేమోననుకుని మేరీ మెచ్చేటట్లు ఇల్లంతా అలకరించింది వల్లి. కాని వాళ్ళు మరునాడు ఉదయమే వెళ్ళిపోయారని జయసింహ చెప్పాడు.

ఉసూరుమన్నట్టయింది వల్లికి.

అలా రెండునెలలకూ మూడునెలలకూ వస్తూఉండేవాడు అలెగ్జాండరు భార్యతోకూడా. ఒకటి రెండు రోజులు ఉండేవారు. మేరీ వల్లీ కలుసుకుని మాట్లాడుకునేవారు. జోక్సు చేసుకునేవారు జీవితాలను సింహావలోకనం చేసుకునేవారు.

కంపెనీల పనిమీద అలెగ్జాండరు జయసింహా కలిసి తిరుగుతూ ఉండేవారు. ఒక్కొక్కప్పుడు మేరీలేకుండాకూడా అలెగ్జాండరు వచ్చేవాడు. వచ్చినప్పుడు జయసింహ ఇంట్లోనే దిగేవాడు.

అప్పుడే వల్లీ చెల్లెలు పిల్లలను తీసుకువచ్చింది సెలవులకు. వల్లీ చెల్లెలు మధుర చాలా చనువుగా ఇంట్లో తిరుగుతూ అక్కకు సహాయంచేస్తూఉండేది. పిల్లలతో ఆడుకుంటూ ఉండేది. ఎవరు వచ్చినా మర్యాదగా మాట్లాడి స్వాగతమిచ్చేది. అలెగ్జాండర్ వచ్చినప్పుడు అతడికి కావలసినవన్నీ అందించేది. అతడుకూడా ఏదికావలసి వచ్చినా స్వతంత్రంగా ఆమెనే పిలిచేవాడు.

ఒకసారి అలెగ్జాండర్ వచ్చినప్పుడు వల్లీ అడిగింది. 'మేరీ రావటం లేదేమ'ని.

"ఈమధ్య మేరీ మనసు మారిపోయింది."

"అదేమిటి ? సరదాగా మీతో వచ్చేదికదా ?" మేరీ వెనకటిమాటలు జ్ఞాపకంవచ్చాయి వల్లికి. అట్లా కాకూడదని కోరుకుంది.

"మేరీ ఇంకనుంచీ నాతోరాదు. ఇక్కడినుంచి వెళ్ళగానే డైవోర్సుచేసింది".

"అలాగా ! నాకు తెలియక అడిగాను క్షమించండి."

"దానిదేముంది ? మాదేశాలలో ఇది చాలా మామూలు విషయం. అడిగినా ఎవరూ తప్పుపట్టుకోరు" అన్నాడు.

మధ్యాహ్నం మూడుగంటలకు అలెగ్జాండరు కారులో బైటికివెళ్ళాడు.

ఆ సాయంత్రము జయసింహ ఇంట్లో అలెగ్జాండరు వచ్చాడని కంపెనీలో పనిచేసే అధికారులందరికీ పార్టీ ఇస్తున్నాడు. వాకిటివైపు పక్కగా షామియానా వేశారు. బల్లలూ కుర్చీలు అమర్చారు. సాయంకాలము నాలుగు గంటలనుంచీ ఆడావుడిగాఉంది. అలెగ్జాండరు ఆ పార్టీకి ముఖ్య అతిథి.

ఆహూతులందరూ రావలసిన టైము ఆరున్నర.

సరిగ్గా ఐదుగంటలకు అలెగ్జాండరు మధురమెళ్ళో పూలహారాలతో చేతుల్లో పుష్పగుచ్ఛాలతో మెరిసిపోయే ఉంగారాల వేళ్ళతో కారుదిగి లోపలికివచ్చారు.

జయసింహ మేడమీదినుంచి మెట్లుదిగివస్తున్నాడు. వల్లీ పనివాళ్ళకు ఏదో ఆదేశాలిస్తూ హాల్లోకి వచ్చింది.

"మాదేశంలో పెళ్ళికాగానే పెద్దవాళ్ళకు పాదాభివందనంచేస్తారు. మా అక్కా

బావలిద్దరూ ఇక్కడే ఉన్నారు రండి" అంటూ లోపలికి దారితీసింది మధుర. ఇద్దరూవెళ్ళి నమస్కరించారు.

వల్లి కళ్ళుపెద్దవిచేసిచూస్తూ "మా మధుర ఎప్పటినుంచీ ఆలోచిస్తున్నది పెళ్ళిచేసుకోవాలని ?" ఆశ్చర్యపడ్డది.

"మంచి సెలక్షనే మధురది. అయితే ఇప్పుడు మనిమిచ్చేపార్టీ పెళ్ళిపార్టీ అన్నమాట. ఎంతబాగా కుదిరింది రెండింటికీ" అంటూ ఇటుతిరిగి ఇద్దరితలల మీద చెయ్యిపెట్టి ఏదో అనబోతున్నాడు జయసింహ.

"ఆగండి. హారతి అక్షంతలూ తెస్తున్నాను" అంటూ వల్లి కేకపెట్టింది వంటయింట్లోనుంచి.

వధూవరులిద్దరికీ హారతియిచ్చి, నమస్కారాలు పెట్టించుకుని "చిరకాలం దంపతులు సుఖసంతోషాలతో వర్ధిల్లండి" అని దీవించారిద్దరూ.

వాళ్ళిద్దరినీ కుర్చీలమీద షామియానాలో కూర్చోబెట్టి, "మళ్ళీ పూలహారాల మార్పిడి చేయిస్తాను అందరూ రాగానే" అన్నాడు జయసింహ.

ఆహూతులందరూ ఒక్కొక్కళ్ళే రావటం మొదలుపెట్టారు. షామియానా పదినిమిషాలలో నిండిపోయింది.

"ఇది అలెగ్జాండర్ మధురల పెళ్ళిపార్టీ" అని ప్రకటించి వధూవరుల చేతుల్లో రెండు పూలహారాలు పెట్టాడు జయసింహ. వాళ్ళిద్దరూ దండలు మార్చుకున్నారు.

విందు ప్రారంభమైంది.

"మిస్టర్ జయసింహ. మాతోముందు చెప్పలేదెందుకు ? మేమూ పూల గుత్తులూ ప్రెజంటేషన్లు తెచ్చేవాళ్ళంకదా ! శుభకార్యానికి వట్టిచేతులతో వచ్చాం" అన్నారు అతిథులు.

"అందుకే ముందుచెప్పలేదు" అన్నాడు అలెగ్జాండరు.

"అవును ఇది డబ్బు వృధాగా ఖర్చుచేసే కాలంకాదు కదా !" అన్నాడు జయసింహ.

పార్టీ ముగిసింది. వెళ్ళేటప్పుడు నూతనదంపతులకు అందరూ శుభా కాంక్షలు తెలిపారు.

లోపలికి వచ్చిన తరువాత "మధురకు మా నాన్నగారు మంచిసంబంధం చూడమని ఉత్తరంరాస్తూ "వరుడు బుద్ధిమంతుడూ ఉద్యోగి అయితే బాగుంటుందని రాశారు. నేనుకూడా ఆ దృష్టితోనే అప్పటినుంచీ చూస్తున్నాను. నేను అందరితో చెప్పిఉంచాను. ఇంతలోకి మా మధురే స్వయంగా మిమ్మల్ని ఎన్నుకుంది" అన్నాడు అలెగ్జాండరుతో కరచాలనంచేస్తున్న జయసింహ.

ఆ ఉదయం జయసింహ తన బల్లమీద ఒకఉత్తరం చూశాడు.

శ్రీ జయసింహగారికి-

"మేము రేపు ఉదయం కాకముందే బయలుదేరుతాము. మధుర పెళ్ళి అయిన తరువాత తిరుపతి వెళ్దామన్నది. అక్కడ ఒకరోజుండి హనీమూన్‌కి ఎటైనా వెళ్తాము. పెళ్ళిసంగతి మీతో సంప్రతించాలనుకున్నాను. గాని పని తొందరలో మా నిర్ణయాన్ని మీకిద్దరికీ తెలపటానికి సందేహించాను. నేను అన్య మతస్థుడిని. మధురకంటె పదేళ్ళు పెద్దవాడిని. మీరు కాదంటారనుకున్నాను. కాని మధుర పెళ్ళిచేసుకుని చెప్పినా మా నాన్నగాని మా అన్నగాని కోపగించరని నాకు ధైర్యం చెప్పింది. వాళ్ళుకూడా మీవంటివారికోసమే వెతుకుతున్నారన్నది. నాకు వెంటనే ధైర్యం వచ్చింది. మీతోచెబితే అట్టహాసం చేస్తారన్న భయంకూడా మనసులో మెదిలింది. అందుకని ఈ పనిచేశాము. మీరు మరేమీ అనుకోకుండా మమ్మల్ని క్షమించి ఈ పెళ్ళిని ఆమోదించినట్టుగా పెళ్ళివిందుచేశారు. హారతులు ఆశీర్వచనాలతో ఇంట్లోకి ఆహ్వానించారు. మాకిద్దరికీ చాలా ఆనందం కలిగింది. అదీకాక- మధురా నేనూ ఒకరికొకరం బాగా అర్థంచేసుకున్నాము. నాకు అన్నిటి కంటె మీయింటి సంప్రదాయం నచ్చింది. మధురమైన మధుర ప్రవర్తనతో నా మెదడుకు పట్టిన బూజునంతా దులుపుకున్నాను. ఆమెనన్నెంతో సంస్కరించింది. అడుగడుక్కీ అవమానింపబడినవాడిని కనుక నాకు ఆమె సౌమ్యమైన ప్రవర్తన నచ్చింది. మీయిల్లూ మీ మర్యాదలూ ప్రేమలూ, ఆతిథ్యపుతీరులూ చూసిన తరువాత జీవితం ఎట్లాఉంటే బాగుంటుందో- ఆనందంగా ఉంటుందో నాకర్థమైంది. అందుకనే కావాలనే మీయింట్లోదిగాను. మీ ఔన్నత్యం మాకురాదు. నాకు మీరనుభ

వించే స్వర్గం కావాలంటే మధురను పెళ్ళిచేసుకోక తప్పదనుకున్నాను. దీనిలో ఏదయినా పొరబాటుంటే క్షమించండి.

మరొకసంగతి - దీనికంతకూ మూలకారకురాలు శ్రీమతి జయసింహ. ఆమె మొదట మమ్మల్ని మీయింటికి ఆహ్వానించినప్పటినుంచీ ఆమెమాట-మర్యాద ప్రవర్తన నన్ను కదలించివేశాయి. మీయిద్దరి అనుబంధము నన్ను ముగ్ధుణ్ణిచేసింది. అందుకు ఆమెకు నా కృతజ్ఞతలు.

మేమేమీ తప్పుపనిచేయలేదని మీ మామగారికి తెలియచేయండి. నేను తిరిగివచ్చిన తరువాత తీరికగా మీ శ్రీమతికి జాబు వ్రాస్తాను.

ఇట్లు
మీ అలెగ్జాండరు.

ఆ ఉత్తరం చదువుకుని వల్లికికూడా చూపించాడు. "ఆయనకు నరకం చూపించి ఉంటుంది మేరీ. నాకుచూడగానే అర్థమైంది. ఆమెదృష్టిలో మనము వట్టి తెలివితక్కువవాళ్ళము. మానాన్నగారికి జాబు వ్రాయండి. సంతోషిస్తారు." అన్నది వల్లి.